జీబీసీ రహదారి విస్తరణ పనులు ప్రారంభం

- ఎమ్మెల్యే కిలారి చొరవతో మూడు దశాబ్దాల తర్వాత మోక్షం
- మున్సిపల్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది సహకారంతో భవనాల తొలగింపు


పొన్నూరు పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా యంత్రంతో తొలగింపు పనులు

చేబ్రోలు: పొన్నూరు పట్టణంలోని జీబీసీ రహదారి విస్తరణ పనులు శుక్రవారం మున్సిపల్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారుల సమన్వయంతో ప్రారంభమయ్యాయి. మూడు దశాబ్దాలుగా జాప్యం నెలకొన్న జీబీసీ రోడ్డు అభివృద్ధి, విస్తరణ తొలిదవ పనులు స్థానిక సాక్షి భావనారాయణ స్వామి దేవాలయం సమీప ప్రాంతం నుంచి కొప్పాక వెంకయ్య మున్సిపల్ కూరగాయల మార్కెట్ వరకు చేపట్టారు. గత ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య జీబీసీ రహదారి విస్తరణ చేపడతానిని హామీ ఇచ్చారు. కొంతకాలంగా పనులు చేపట్టేందుకు ఆయన తీవ్రంగా కృషి చేశారు. రహదారి విస్తరణలో భాగంగా 158 మందికి చెందిన భవనాలు తొలగించేందుకు మున్సిపల్ అధికారులు గుర్తించారు. వీరికి పరిహారం అందించేందుకు సుమారు నాలుగు కోట్లు ప్రత్యేక నిధులను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించారు. భవనాల తొలగింపుపై 66 మంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వీరిలో 22 మంది రోడ్డు విస్తరణ చేసేందుకు తమ అంగీకారాన్ని తెలియజేస్తూ సంతకాలు చేశారు. ఈ నెల 29వ తేదీ వరకు భవన యజమానులు తమ అభ్యంతరాలు, ఆక్షేపణలు మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేసేందుకు న్యాయస్థానం సమయం ఇచ్చింది. మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, ఆర్ అండ్‌బీ ఏఈ రాంబాబు, తెనాలి డీఎస్పీ వి.జనార్దన్‌రావు పట్టణ సీఐ మహమ్మద్ కాజా అల్తాఫ్ హుస్సేన్, తహసీల్దారు శ్రీకాంత్ కేదార్నాథ్ కూల్చివేత పనులను పర్యవేక్షించారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, వంద మంది మున్సిపల్ సిబ్బంది, 12 మంది సూపర్‌వైజర్లతో బృందాలను ఏర్పాటు చేశారు. భవనాల కూల్చివేతకు తొమ్మిది ప్రొక్లెయినర్‌లు, 15 ట్రాక్టర్లు, 9 టాటా ఏసీలను వినియోగించారు.

'చిప్స్' ఫార్మసీలో ఘనంగా స్నాతకోత్సవం



డిగ్రీ పట్టాను అందజేస్తున్న ఏఎన్‌యూ రెక్టర్ వరప్రసాదమూర్తి, డిప్యూటీ కలెక్టర్ సాయి శ్రీ

గుంటూరు రూరల్: విద్యార్థులు గ్రాడ్యుయేషన్ తరువాత నిర్దేశించుకున్న లక్ష్యాలు ఉన్నతంగా ఉండాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ వరప్రసాదమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల స్నాతకోత్సవ వేడుకలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఏఎన్‌యూ రెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని లక్ష్య సాధన దిశగా కృషిచేయాలన్నారు. జిల్లా డిప్యూటీ కలెక్టర్ సాయిశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు వారి లక్ష్యాన్ని సరైన సమయంలో, సరైన నిర్ణయంతో నిర్ణయించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ విద్యాధర్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు పలు రకాల ఎండోమెంట్ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామని తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో బీ ఫార్మశీ, డీ ఫార్మశీ పూర్తి చేసిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా డిగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్ గోపాలకృష్ణ, కళాశాల ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళిమోహన్, అదనపు కార్యదర్శి చుక్కపల్లి రమేష్, కార్యవర్గ సభ్యులు వి.కుప్పుస్వామి, డాక్టర్ పరుచూరి గోపిచంద్, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు రూరల్: మండల పరిధిలోని సబ్‌స్టేషన్‌ల నిర్వహణ నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ బి.రాజమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవీపీ కాలనీ, శ్రీనివాసరావుతోట, 60 అడుగుల రోడ్డు, కృష్ణబాబు కాలనీ, జ్యోత్స్న నగర్, కొండ రామయ్య నగర్, కొత్తకాలనీ, కావేరి కాలనీ, కామాక్షినగర్, కోదండరామయ్య నగర్, మిర్చియార్డు రోడ్డు, లాల్‌పురం, భవానీపురం, లింగాయపాలెం, అంకిరెడ్డిపాలెం, చల్లావారిపాలెం, పొత్తూరు, నాయుడుపేట, ఓబులనాయుడుపాలెం, అంబేడ్కర్‌నగర్, దాసరిపాలెం, బోడవరం, జోలం చుండూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాల అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గమనించాలని తెలిపారు.

పెదనందిపాడు: పెదనందిపాడు, వరగాని సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వీరాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడి మృతి


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

ప్రత్తిపాడు: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు ఎస్‌ఐ డి. రవీంద్రబాబు వివరాల మేరకు.. బోయపాలెం 16వ నంబరు జాతీయ రహదారిపై అండర్ పాస్ వద్ద గుర్తుతెలియని ఓ వృద్ధుడు నీరసించి పడిపోయి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. అంబులెన్స్‌కు ఫోన్ చేసి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ వృద్ధుడు చికిత్స పొందుతూ ఈ నెల 9న కన్నుమూశాడు. ప్రత్తిపాడు ఎస్‌ఐ అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. చుట్టుపక్కల విచారించినప్పటికీ మృతుడి ఆచూకీ లభించలేదు. మృతుని వయస్సు సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని, చామన ఛాయ రంగులో 5.6 అడుగులు ఉంటాడని ఎస్‌ఐ తెలిపారు. మృతుని శరీరంపై తెలుపు, బ్లూ, పచ్చ రంగు దుస్తులు, దుప్పటి మాత్రమే ఉన్నాయని, ఛాతి భాగంలో మెడకు కుడి పక్కన రెండు పుట్టు మచ్చలున్నాయని చెప్పారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 8988 831386 లేదా 0863 2280233 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నా భూమి- నా దేశం

పెదనందిపాడు: మూడు గ్రామాల్లో నా భూమి – నా దేశం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గోగులమూడి రావిపాడు, పూసులూరు, పమిడివారపాలెం గ్రామాల్లో ఎంపీడీఓ రాజగోపాల్ స్వాతంత్య్ర సమర యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

ఆకట్టుకున్న చారిత్రక కట్టడాల నమూనాల ప్రదర్శన

తెనాలి అర్బన్: మదీనా మసీదు కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులు శుక్రవారం చారిత్రాక కట్టడాల ప్రదర్శన నిర్వహించారు. మసీదు ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఢిల్లీలోని ఎర్రకోట, కుతుబ్‌మీనార్, ఇండియా గేట్, హైదరాబాద్‌లోని చార్మినార్, ఆగ్రాలోని తాజ్‌మహల్ తదితర నమూనాలు ఆకట్టుకున్నాయి. జాతీయ పతకాన్ని నమూనాలపై అలంకరించి అందంగా తీర్చిదిద్దారు. కార్యక్రమాన్ని మదీనా మసీదు ఇమామ్ ముఫ్తీ ఉస్మాన్‌ఖాన్, ముతవల్లి హాజీ షేక్ యాకూబ్, మహమ్మద్ సలీం పర్యవేక్షించారు.

చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ముగిసిన శిక్షణ శిబిరం


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్

గుంటూరు రూరల్: సాంకేతిక నైపుణ్యాలను సద్వినియోగించుకుని ఆధునిక ఆలోచనలతో విద్యార్థులు ముందుకు సాగాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. నాలుగు రోజులుగా లాం నందున్న కళాశాలలో బ్లాక్‌చైన్ టెక్నాలజీపై శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యంలో ప్రపంచంతో పోటీ పడే విధంగా ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఇటువంటి శిక్షణ శిబిరాల ద్వారా ప్రతి విద్యార్థి తమ వ్యక్తిగత సమాచారం ఇంటర్నెట్‌లో భద్రపరిచేందుకు కావాల్సిన మెళకువలు తెలుసుకోవచ్చన్నారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ జె.భార్గవ్ పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

- హాజరైన 1482 మంది అభ్యర్థులు
- ఉద్యోగాలకు 411 మంది ఎంపిక

తెనాలి: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నైపుణ్యాభివృద్ధి, శిక్షణశాఖ, గుంటూరు జిల్లా సహకారంతో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళా విజయవంతమైంది. రాష్ట్రంలోని 30 పైగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఆయా కంపెనీల్లో దాదాపుగా 1100 ఉద్యోగ అవకాశాలు ఉండగా, 1482 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మొత్తం 560 మందిని వివిధ కంపెనీలు ఎంపిక చేసుకున్నాయి. ఏఎస్ఎన్ కాలేజీ ఆవరణలో సాయంత్రం ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లను అందజేశారు. కెరీర్‌లో చక్కగా పనిచేస్తూ ఉన్నత అవకాశాలను అందుకోవాలని సూచించారు. ఉదయం జరిగిన జాబ్‌మేళా ప్రారంభ సభకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి ప్రసన్నకుమార్ అధ్యక్షత వహించారు.ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, తమ కాలేజీ విద్యార్థులే కాకుండా చదువుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నియోజకవర్గంలోని యువతకు తగిన వేదిక కల్పించాలనే లక్ష్యంతోనే ఏటా మెగాజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికి మూడుసార్లుగా నిర్వహించిన జాబ్‌మేళాలతో రెండు వేలమందికి పైగా ఉద్యోగాలు పొందినట్టు చెప్పారు. ప్రస్తుత జాబ్‌మేళానూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ఉపాధి కల్పనా సంస్థ అధికారి రాజారావు మాట్లాడుతూ కంపెనీలు విడివిడిగా కాకుండా ఉమ్మడిగా ఇంటర్వ్యూలు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంపై ఒక్కో నెల ఒక్కో నియోజకవర్గంలో మెగాజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ, ఏఎస్ఎన్ కాలేజీలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిరంతర ప్రక్రియగా చెప్పారు. కాలేజీ నుంచి ఎందరో ఉన్నత ఉద్యోగాల్లో, సొంత కంపెనీల నిర్వహణలో ఉన్నట్టు చెప్పారు. వీరితోపాటు తెనాలి ప్రాంతంలోని నిరుద్యోగుల కోసం ఎమ్మెల్యే శివకుమార్ ఏటా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వివరించారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అవసరం



విద్యార్థి నాయకులతో శివాజీ, విష్ణువర్ధన్, కృష్ణవేణి, పద్మజ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల పాలకవర్గ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ సూచించారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో శుక్రవారం నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ ఓటింగ్ పద్ధతి ద్వారా ఎన్నుకొన్న పాఠశాల హెడ్‌బాయ్ జతిన్ స్వరాజ్, హెడ్ గర్ల్ చరణ్య తేజస్వినితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, భావిభారత పౌరులుగా ఎదిగేందుకు ఇవి ఎంతగానో తోడ్పడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు తప్పక పాటించాలి

ఏపీ ఎలక్ట్రికల్ సేఫ్టీ డైరెక్టరేట్, సీఈఐజీ జి.విజయలక్ష్మి


మాట్లాడుతున్న విజయలక్ష్మి

చేబ్రోలు: వినియోగదారులందరూ ఎలక్ట్రికల్ భద్రతా ప్రమాణాలు తప్పక పాటించాలని ఏపీ ఎలక్ట్రికల్ సేఫ్టీ డైరెక్టరేట్, సీఈఐజీ జి.విజయలక్ష్మి అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ సేఫ్టీ అనే అంశంపై శుక్రవారం ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని జరిగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ వాహనాలపై ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు జారిపడినా లేదా వాటికి మనం ప్రయాణించే వాహనం తగిలినట్లైతే వాహనంలో నుంచి బయటపడేందుకు హోపింగ్ (గెంతడం లేదా దూకటం) విధానాన్ని అనుసరించాలన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు సంబంధించి మోటారు స్టార్టర్లు, స్విచ్చులు ఉన్న ఇనుప బోర్డులను విధిగా ఎర్తింగ్ చేయాలన్నారు. మోటార్లు తిరగకపోతే.. విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తుల నిమిత్తం రైతులు ఎక్కరాదన్నారు. పొలాల్లో తెగిపడిన, జారిపడి తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లకు దూరంగా ఉండి సంబంధిత విద్యుత్ సిబ్బందికి, గ్రామ సచివాలయాల్లో ఉన్న ఎనర్జీ సహాయకులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ వి.జయబాబు, గుంటూరు డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ పి.బాలక్రిష్ణ, విజ్ఞాన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణకు యత్నంపై కేసు నమోదు

నడింపాలెం (ప్రత్తిపాడు): భూ ఆక్రమణకు పాల్పడుతున్న వ్యక్తులపై ప్రత్తిపాడు పోలీసు స్టేషనులో శుక్రవారం కేసు నమోదయ్యింది. ప్రత్తిపాడు ఎస్‌ఐ డి.రవీంద్రబాబు వివరాల మేరకు.. గుంటూరు ఆర్.అగ్రహారానికి చెందిన వినోద్‌కుమార్ జైన్ 18 సంవత్సరాల కిందట ప్రత్తిపాడు మండలం నడింపాలెం పరిధిలో ఆరున్నర ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. ఆ భూమిలో 3.80 ఎకరాలను స్థానికంగా నివసించే ఆలేటి ప్రభావతితో పాటు మరికొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో కొద్ది రోజుల కిందట ఫెన్సింగ్ వైర్లు కట్ చేశారని, సంబంధిత భూమి చుట్టూ ఎమ్మార్వీఎస్ జెండాలు పాతారని వినోద్‌కుమార్ జైన్ శుక్రవారం ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు ప్రభుత్వం కృషి


అంబటి తిరుపతి రాయుడును సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ మోజెస్, సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉందని, వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ (ఏసీ) కళాశాలను సందర్శించారు. విద్యార్థులు, అధ్యాపకులతో ఏర్పాటు చేసిన ముఖాముఖీలో మాట్లాడారు. వర్గ భేదాలు లేకుండా సమష్టిగా ముందుకు వెళ్లినప్పుడే అభివృద్ధికర సమాజాన్ని చూడగలమని తెలిపారు. విద్యార్థులు రోజులో గంటను క్రీడల కోసం కేటాయించాలని, అప్పుడే దేహదారుఢ్యంతో పాటు భావి క్రీడాకారులుగా రాణించగలరని ఆయన సూచించారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న వివిధ కార్యక్రమాల అమలు, తీరుతెన్నుల్ని ఇంటర్ విద్యార్థుల్ని అడిగి తెలుసుకున్నారు. తన తండ్రి అంబటి సాంబశివరావు ఏసీ కళాశాల పూర్వ విద్యార్థి అని చెప్పేందుకు ఎంతో గర్వపడుతున్నానన్నారు. దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని, అత్యున్నత భావాలతో సమాజాన్ని తద్వారా రాష్ట్ర, దేశాభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన వివిధ ప్రశ్నలకు వివరణాత్మకమైన సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.ఎఫ్. పరదేశిబాబు అంబటి రాయుడుకు అభినందనలు తెలియజేశారు. సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జీఏ శాలిని, డాక్టర్ జీఏ ప్రీతం ప్రకాష్, డాక్టర్ బి.విజయ్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ విజయ్ శేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి



కాకుమాను: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు వింత రాఘవరెడ్డి అన్నారు. వల్లూరు, అప్పాపురం, కొండపాటూరు, రేటూరు, కె.బి.పాలెం గ్రామాలలో శుక్రవారం నా భూమి– నా దేశం కార్యక్రమం నిర్వహించారు. వల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో రాఘవరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టి. వెంకటరెడ్డి, ఎంపీడీఓ రామకష్ణ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన



గుంటూరు రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అటువంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా శిక్షించబడతారని క్రాఫ్ ఎన్జీవో సంస్థ కమ్యూనిటీ సోషల్ వర్కర్ సీహెచ్ పద్మజ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలు, వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోస్టర్ల ద్వారా బాల్య వివాహాల దుష్పరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



పెదకాకాని: వర్షాకాలంలో సోకే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయుష్ డాక్టర్ సీహెచ్ సౌజన్య అన్నారు. నంబూరు గ్రామంలో శనివారం ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆయుష్ గ్రామ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సీహెచ్ సౌజన్య మాట్లాడుతూ నంబూరు కాశీ కార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద ఆసుపత్రి వైద్య సిబ్బంది పి.వెంకటేశ్వర్లు, ఎస్టీ కరీం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధన ఉపకారణాల పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రత్యేక అవసరాలు పిల్లలు సాధారణ విద్యార్థులతో ఉండడం ద్వారా వారు లోపాలు, సమస్యల నుంచి బయటపడగలరని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త ఏ. విజయలక్ష్మి పేర్కొన్నారు. బ్రాడీపేటలోని శారదానికేతన్ ప్రాంగణంలో ఉన్న సమగ్రశిక్ష భవిత కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధన ఉపకారణాల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ బోధన ఉపకారణాల ద్వారా విద్యను పిల్లలకు మరింత సులభంగా అందించవచ్చని తెలిపారు. సికింద్రాబాద్‌కు చెందిన నిప్పిడి సంస్థ అందజేస్తున్న విలువైన బోధన ఉపకరణాల్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా బుద్ధిమాంద్యం గల పిల్లలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. జాతీయ మేధాపర సాధికార సంస్థ ప్రతినిధి రాజేంద్ర మాట్లాడుతూ పిల్లలకు వారి వయసు ఆధారంగా మూడు రకాల కిట్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఒక్కొక్కటి రూ.10వేల విలువైన 102 కిట్లు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి మూడేళ్ల ఒకసారి ప్రత్యేక అవసరాల పిల్లలకు కిట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై రోజువారీ నివేదిక ఇవ్వండి

ఇంజినీరింగ్ అధికారుల సమావేశంలో నగర కమిషనర్ చేకూరి కీర్తి


సమావేశంలో సమీక్షిస్తున్న కమిషనర్ చేకూరి కీర్తి

నెహ్రూనగర్: అభివృద్ధి పనుల పురోగతిపై రోజువారీ నివేదిక ఇవ్వాలని, జాప్యం లేకుండా నిర్దేశిత గడువు మేరకు వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెండర్ పొందిన పనుల్ని నిర్దేశిత గడువు మేరకు జరిగేలా చూడాలని ఏఈలకు చెప్పారు. పనుల్లో జాప్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. నాణ్యతలో రాజీ లేదని, ఎక్కడైనా లోపం గుర్తిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గడప గడపకు మన ప్రభుత్వం పనులు వేగంగా జరగాలని, పూర్తయిన వాటికి బిల్స్ అప్‌లోడ్ చేయాలని చెప్పారు. నగరపాలక సంస్థ ఖాళీ స్థలాల్లో వాకింగ్ ట్రాక్‌లు, ఇతర ప్రజోపయోగ పనుల నిర్వహణకు ఏడీహెచ్, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రతిపాదనల్ని ఏఈల వారీగా సిద్ధం చేయాలని ఆమె సూచించారు.

రోడ్ల విస్తరణ పనుల్ని పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో చేపట్టాలని తెలిపారు. చెత్త తరలింపు ఈ– ఆటోల జీపీఎస్ రిపోర్ట్ ప్రతి రోజు పంపాలని, ఎక్కడైనా చార్జింగ్ పాయింట్స్ సమస్య ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. పాఠశాలల్లో నాడు – నేడు పనుల పురోగతిపై ఈఈల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తరగతులు జరుగుతున్నందున, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రధానోపాధ్యాయులతో సమన్వయం చేసుకోవాలని ఆమె సూచించారు. 15వ ఫైనాన్స్, ఎస్.క్యాప్ నిధులతో చేపట్టే పనులు నిర్దేశిత గడువు మేరకు జరిగేలా ఆయా ప్రాంత డీఈఈలు ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షణ చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఏఈలు తమ పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా పర్యవేక్షణ చేయాలని, సచివాలయాల వారీగా ఎమినిటీ కార్యదర్శులు కూడా పైపులైన్ లీకులు, కలుషిత నీటి సరఫరాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. సమావేశంలో ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, డీఈఈలు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ Union Bank of India

పొన్నూరు బ్రాంచి,
చిరునామా: జీబీసీ రోడ్డు, పొన్నూరు
ఫోన్: 9137104331
E Mail: ubin0804339@unionbankofindia.bank

ఋణగ్రహీతకు అమ్మకము గురించిన నోటీసు (30 దినముల నోటీసు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని రూలు 6(2)/8(6)) ప్రకారం

From : చీఫ్‌మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, [illegible] బ్రాంచి, గుంటూరు జిల్లా (యాక్ట్ 54 ఆఫ్ 2002).

To: 1) ఋణగ్రహీత(లు)/[illegible] : 1. [illegible], చిరునామా: డి.నెం.15-3-3/2, [illegible], పొన్నూరు, 2) శ్రీమతి [illegible], చిరునామా: [illegible], ముంబై-400078, 3. శ్రీ [illegible], చిరునామా: డి.నెం.1-66-1, [illegible], పొన్నూరు మండలం-522112, [illegible] ఫ్లాట్ నెం.13, [illegible], 4. శ్రీ [illegible] ప్రసాద్, తండ్రి: [illegible], చిరునామా: డి.నెం.1-66-1, [illegible], పొన్నూరు మండలం-522112, 5. శ్రీ [illegible], తండ్రి: [illegible], చిరునామా: డి.నెం.1-66-1, [illegible], పొన్నూరు మండలం-522112.

విషయము : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పొన్నూరు బ్రాంచి, గుంటూరు జిల్లా వారికి [illegible] సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం (2002లోని చట్టం 54) క్రింద ఆస్తి విక్రయము గురించి.

సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద [illegible] నోటీసు ద్వారా [illegible] తేది.04-03-2020 [illegible]

[illegible] తేది.28-06-2023 [illegible]

[illegible] రూ.25,95,000/- [illegible]

[illegible] 7 రోజుల లోపల [illegible]

[illegible] తేది.04-03-2020 [illegible] సెక్షన్ 13(8) ప్రకారం [illegible]

స్థిరాస్తి వివరములు

1వ ఐటమ్: గుంటూరు జిల్లా, పొన్నూరు సబ్ జిల్లా, పొన్నూరు మండలం, [illegible], డి.నెం.320-5, డి.నెం.230-6 మరియు డి.నెం.232/4 [illegible] 726 [illegible] (దస్తావేజు నెం.52/1081) [illegible]

2వ ఐటమ్: గుంటూరు జిల్లా, పొన్నూరు సబ్ జిల్లా, పొన్నూరు మండలం, [illegible], డి.నెం.322/4 [illegible] 230 [illegible] (దస్తావేజు నెం.946/2007) [illegible] ఐటమ్ నెం.1&2 [illegible] 956.00 [illegible] 878.00 [illegible].

స్థలం : పొన్నూరు — సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
తేది : 07-08-2023 — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పొన్నూరు బ్రాంచి, గుంటూరు జిల్లా.